క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం

కలిగిరి: మండలంలోని కుమ్మరకొండూరులో నోటి సుబ్బారెడ్డికి చెందిన పూరిల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొందరు గురువారం పోలేరమ్మకు పొంగళ్లు పెడుతూ బాణసంచా కాల్చగా నిప్పురవ్వలు సుబ్బారెడ్డి ఇంటిపై పడి మంటలు చెలరేగాయి. పూరిల్లు పూర్తిగా కాలిపోగా ఇంటి ముందు వేసి ఉన్న రేకులు కూడా దెబ్బతిన్నాయి. ఇంట్లోని ధాన్యం, దుస్తులు, గృహోపకరణలు, ఇతర సామగ్రి బూడిదయ్యాయి. వింజమూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. శుక్రవారం రెవెన్యూ అధికారులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. సుమారు రూ. 4 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని, కట్టుబట్టలతో నిలిచామని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు వేడుకున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం ఆదూరుపల్లి గిరిజనకాలనీకి చెందిన అగ్నిప్రమాద బాధితులకు రెవెన్యూ అధికారులు చేయూతనందించారు. గురువారం రాత్రి సంభవించిన అగ్నిప్రమాదంలో మూడు గిరిజన కుటుంబాలు సర్వం కోల్పోయిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలను తహసీల్దార్ మురళి శుక్రవారం పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5వేలు చొప్పున నగదు, నిత్యావసర సరుకులు, వంట పాత్రలను అందజేశారు. కలెక్టర్‌కు నివేదిక పంపి ప్రభుత్వ సాయం అందజేస్తామని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

ఆవు, గేదె దూడల మృతి



మృతి చెందిన ఆవు దూడ

సీతారామపురం: స్థానిక జగనన్న కాలనీ సమీపంలో సీతారామపురం–ఉదయగిరి జాతీయ రహదారిపై శుక్రవారం వేకువన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆవు, గేదె దూడలు మృతి చెందాయి. ఉదయం అటుగా వెళ్తున్న వాహనదారులు, పాదచారులు గమనించి దూడలను పక్కకు తొలగించారు.

చిత్తడి నేలల సంరక్షణ కేంద్రంగా కొండమీదకొండూరు



అనుమసముద్రంపేట: మండలంలోని కొండమీదకొండూరు చెరువును చిత్తడి నేలల సంరక్షణ, అభివృద్ధి కేంద్రంగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి పిచ్చిరెడ్డి తెలిపారు. కొండమీదకొండూరులో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభను శుక్రవారం నిర్వహించారు. చెరువును చిత్తడి నేలల సంరక్షణ, అభివృద్ధి కేంద్రంగా గుర్తింపుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి గ్రామస్తుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఉపసర్పంచ్ మురళి, స్థానిక నాయకులు కోకంటి సుధాకర్, యల్లారెడ్డి, ఫారెస్ట్ బీట్ అధికారులు పెంచలయ్య, దొరసానమ్మ, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా వాసవీమాత పునఃప్రతిష్ఠ వేడుకలు


జలదంకి: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. మూడో రోజు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణంలో విశేషపూజలు నిర్వహించారు. గురుప్రార్థన, హోమ పూజలు, శయ్యాదివాసం, ఫలాదివాసం, మహా మంగళహారతి తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం శృంగేరీ శారదా పీఠాధిపతులు విధుశేఖరభారతిస్వామి ఆలయానికి ఆగమనం చేస్తారని పాలకవర్గ సభ్యులు చెప్పారు. 18న స్వామివారి స్వహస్తములతో కుంభాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు తిరంగా ర్యాలీ

ఆత్మకూరురూరల్: ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆత్మకూరులో ఈ నెల 18న తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని పలు రంగాల ప్రముఖులతో బీజేపీ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. తిరంగా ర్యాలీ నిర్వహణపై చర్చించారు. ఆత్మకూరు సత్రం సెంటర్ నుంచి తిరంగా ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు. దేశ భక్తులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుధాకర్‌రెడ్డి, నున్నా సంతోష్‌కుమార్, పట్నం అనిల్ కుమార్, జేపీ, తదితరులు పాల్గొన్నారు.

సోమశిల-కలువాయి నడుమ రాకపోకలు బంద్

- పెన్నా డెల్టాకు ఆరో క్రస్ట్‌గేట్ నుంచి నీటి విడుదల
- డ్యామ్ మీదుగా బైక్‌లు, కార్లు మళ్లింపు
- బస్సులు, లారీలను అనుమతించని డ్యామ్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, రవాణా వాహనదారులు
- కాలువ ఉండే 11,12 గేట్ల ద్వారా నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి



ఆరో క్రస్ట్ గేట్ నుంచి విడుదల చేయడంతో అప్రాన్‌పై వెళ్తున్న నీరు

సోమశిల: సోమశిల జలాశయం అధికారుల తీరుతో సోమశిల– కలువాయి మార్గంలో రాకపోకలు స్తంభించడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం తాగు, సాగునీటి అవసరాల కోసం సోమశిల జలాశయం నుంచి పెన్నాడెల్టాకు నీటిని విడుదల చేస్తున్నారు. తొలుత పవర్ ప్లాంట్ ద్వారా వేయి క్యూసెక్కులను విడుదల చేశారు. ఆ తరువాత 3,200 క్యూసెక్కులకు పెంచారు. నీటి సామర్థ్యాన్ని ఇంకా పెంచాలని ప్రాజెక్ట్ 6వ క్రస్ట్‌గేట్ ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 2500క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సాధారణంగా డెల్టాకు 11,12 గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తారు. వాటి ద్వారా విడుదల చేసిన నీరు కాలువ ద్వారా దిగువకు ప్రవహిస్తుంది. కాలువపై వంతెన ఉండడం వల్ల సోమశిల– కలువాయి మార్గంలో రాకపోకలకు అంతరాయం ఉండదు. అలా కాకుండా 6వ క్రస్ట్‌గేట్ నుంచి నీటిని విడుదల చేసిన జలాశయం అధికారులు అప్రాన్‌పై వెళ్లే వాహనాలను నిలిపివేశారు. బైక్‌లు, కార్లను డ్యామ్‌పై ఉన్న రోడ్డు మీదుగా మళ్లించారు. కానీ ఆర్టీసీ బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలను అనుమతించలేదు. దీంతో సోమశిల నుంచి కలువాయి, పెంచలకోన, తిరుపతి వెళ్లే ప్రయాణికులు, రవాణా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జలాశయం మీదుగా వెళ్లే వాహనదారులు కూడా హిల్‌కాలనీ నుంచి జలాశయానికి ఉన్న మార్గం గుంతలతో అధ్వాన్నంగా ఉండడంతో అవస్థ పడుతున్నారు. ఆ మార్గంలో వెళ్లలేక ఉప్పలపాడు మీదుగా చుట్టూ తిరిగి వెళ్తున్నామని వాపోతున్నారు. 11, 12 గేట్ల నుంచి డెల్టాకు విడుదల చేసిన నీరు వెళ్లే కాలువలో గతంలో అప్రాన్ పనులు చేపట్టే సమయంలో చిన్నపాటి గోడను నిర్మించారు. ప్రస్తుతం నీటిని వదిలితే గోడ దెబ్బతింటుందని, ఆరో గేట్ ద్వారా నీటిని వదులుతూ జలాశయం అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. జలాశయం అధికారులు స్పందించి 11, 12 గేట్ల ద్వారా నీటిని విడుదల చేసి రాకపోకల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



గుంతలతో నిండిన హిల్‌కాలనీ నుంచి జలాశయానికి వెళ్లే రోడ్డు

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సౌజన్య

అల్లూరు: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సీడీపీఓ సౌజన్య అన్నారు. అల్లూరులోని అరుంధతీయవాడ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోక్సో చట్టం, చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 112, బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్, తదితరాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశాకార్యకర్త విజయమ్మ, అంగన్‌వాడీలు ఉషారాణి, ఉమాదేవి, సుజాత, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వసంతోత్సవం



ఉట్టి మహోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వింజమూరు(ఉదయగిరి):వింజమూరు మండలం నల్లగొండ్లలోని హరిహర క్షేత్రంలో జరుగుతున్న శ్రీదేవిభూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం ఉట్టి మహోత్సవం, వసంతోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మోత్సవాలతో అలిసిపోయిన శ్రీవారికి చక్రస్నానం జరిపించారు. అనంతరం ధ్వజారోహనం చేశారు. దీంతో బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టాలు ముగిశాయి. శనివారం సాయంత్రం ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు టీడీడీ వేద పండితులు తనుజ్ విష్ణువర్ధన్, ఆలయ ప్రధానార్చకులు పరాంకుశం సత్యానారాయణాచార్యులు తెలిపారు. కాగా వసంతోత్సవానికి ఉభయకర్తలుగా ఉన్న గ్రామానికి చెందిన బ్రాహ్మణులు ఆకిలి రవిప్రసాద్, వెంకటేశ్వరావు కుటుంబ సభ్యులను ఆలయ మాజీ చైర్మన్ ఎల్‌సీ కొండారెడ్డి సన్మానించారు. ఉభయకర్తలు స్వామివారికి రూ.1.5 లక్షల విలువ చేసే వెండి ఆభరణాలను కానుకగా అందజేశారు.

ఉత్తరకాలువ నీరందక నారుమళ్లు ఎండుముఖం



కోటపాడు వద్ద పోసిన వరి నారుమడి

ఆత్మకూరురూరల్: ఇటీవల ఐఏబీ సమావేశంలో ప్రకటించిన విధంగా ఉత్తరకాలువకు సోమశిల జలాల సరఫరా జరగకపోవడంతో వరినారుమళ్లు పోసుకున్న రైతులు అవి ఎండిపోతుండడంతో తల్లడిల్లుతున్నారు. మండలంలోని మహిమలూరు, కోటపాడు, నారంపేట, కరటంపాడు, పాతజంగాలపల్లి, తదితర గ్రామాల్లో రెండో పంట సాగుకు సిద్ధమైన రైతులు అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలాలను ఉపయోగించుకుని వరినారుమళ్లు పోసుకున్నారు. ఇప్పటికే నారుమడులు 20 రోజులకు చేరుకున్నాయి. ఉత్తర కాలువ నుంచి సాగునీరందకపోవడం..నారుమడులు ఎండిపోయేదశకు చేరుకోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమశిల జలాలను విడుదల చేశారు. ఆ సమయంలో ఉత్తర కాలువ ద్వారా చెరువులకు సాగునీరు అందిస్తామని ప్రకటనలు చేసినప్పటికి అందకపోవడంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. సోమశిల జలాశయం అధికారులు స్పందించి ఉత్తరకాలువకు సాగునీరు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

ఆపరేషన్ సింధూర్ విజయవంతంపై ర్యాలీ



వింజమూరు(ఉదయగిరి): పహల్గాంలో ఉగ్రవాదుల పైశాచికానికి బలైన పౌరుల ఆత్మశాంతి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌ను విజయవంతం చేసిన సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ వింజమూరులో శుక్రవారం సాయంత్రం తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నేతలు, అధికారులు, ఎన్జీఓలు, దేశభక్తులు పెద్దసంఖ్యలో తిరంగాలు చేతబట్టి పాల్గొని దేశభక్తిని ప్రతిబింబించేలా భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. పాకిస్తాన్ కుట్రలను సమర్థవంతంగా తిప్పికొట్టి ప్రతి భారతీయుడు సగర్వంగా నిలబడేలా కేంద్రం చేపట్టిన చర్యలను సమరిస్తూ ర్యాలీని విజయవంతం చేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



సంగం: స్థానిక తిరుమనతిప్ప ఎస్టీ కాలనీలో నేరాల నియంత్రణపై సంగం సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ శుక్రవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశం ఎక్కువన్నారు. ఆరుబయట నిద్రించే వారు ఇంటికి తాళాలు జాగ్రత్తగా వేసుకోవాలని, బంగారు ఆభరణాలు ధరించ వద్దని సూచించారు. చిన్నపిల్లలను నీటి గుంటలు, చెరువులు, పెన్నానది వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. పోలీసులు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని, ఎలాంటి అవసరమొచ్చిన తమకు ఫోన్ చేయాలని కోరారు.

కావలిలో ఓ మోస్తరు వర్షం

కావలి(జలదంకి): పట్టణంలో శుక్రవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని రోడ్లు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. గత కొద్దిరోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ఈ తరుణంలో వర్షం కురవడంతో ప్రజలు కాస్తా ఉపశమనం పొందారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280 ధర పలికింది. వేలానికి 540 బేళ్ల రాగా, 439 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠంగా రూ.280, కనిష్ఠంగా రూ.200, సగటున రూ.250.82 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

భూమిపూజ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. రూ.61 లక్షల వ్యయంతో భవన నిర్మాణం చేపడుతున్నామని, ఆగస్టులోగా భవనాన్ని పూర్తి చేసి నిత్యం వేయి మందికి రుచికరమైన భోజనం అందిస్తామని ఆయన తెలిపారు. ఇదే ప్రాంతంలో త్వరలో ప్రెస్‌క్లబ్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచ్ సృజన, తహసీల్దార్ హమీద్, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

రేషన్‌కార్డులు ఇవ్వాలని వినతి

సోమశిల: అనంతసాగరం గిరిజన కాలనీలోని గిరిజనులకు అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సుభాషిణికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సీపీఎం ఇంటింటి సర్వే ద్వారా గుర్తించిన కార్డులు లేని వివరాలను తహసీల్దార్‌కు అందజేశారు. మండల సీపీఎం గిరిజన శాఖ కార్యదర్శి నాగులూరు వెంకటేష్, నారాయణ, చౌడయ్య, సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

ఉదయగిరి: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని సీడీపీఓ సునీత అన్నారు. స్థానిక ప్రగతి జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలతో తలెత్తే అనర్థాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ షాను, కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



ఉదయగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉదయగిరి రూరల్/సీతారామపురం/వరికుంటపాడు: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరిలో గండిపాళెం పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి ఎం శివకల్పన డెంగీ వ్యాధి దోమలు కుట్టడం వల్ల వస్తుందన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమతెరలు వాడడం ద్వారా డెంగీని నివారించవచ్చని తెలిపారు. సీహెచ్‌ఓ శివకుమారి, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, పర్యవేక్షకులు వెంకటేశ్వర్లు, చెన్నయ్య, అంకమ్మ, తదితరులు పాల్గొన్నారు. అలాగే సీతారామపురంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి స్వప్నారెడ్డి ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్ వరకు వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. వరికుంటపాడులో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారిణి ఆయేషా డెంగీ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సీహెచ్‌ఓ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ యనమల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్/సంగం/అనుమసముద్రంపేట/సోమశిల: ఆత్మకూరు మండలం మహిమలూరులో పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అనూషా, ఇనాని వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్‌రజాక్, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ ఖాదర్‌బాషా, తదితరులు తదితరులు పాల్గొన్నారు. అలాగే సంగంలో పీహెచ్‌సీ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యారోగ్య సిబ్బంది డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ అశోక్ కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి సీహెచ్ మల్లెంకొండయ్య, సబ్ యూనిట్ అధికారి షేక్ ఖాదర్‌బాషా, హెల్త్ సూపర్‌వైజర్ జలీల్‌అహ్మద్ పాల్గొన్నారు. ఏఎస్‌పేటలో పీహెచ్‌సీ వైద్యులు మంజులమ్మ, సురేష్‌బాబు ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతసాగరంలో పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శ్రావణి, సీహెచ్‌ఓ, హెల్త్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



వరికుంటపాడులో..



ఆత్మకూరురూరల్: మహిమలూరులో..



సీతారామపురంలో..

సంపద సృష్టి ఇలాగేనా?



ఆత్మకూరు బైపాస్‌రోడ్డులోని సంపద తయారీ కేంద్రం



గుండెమడకల రోడ్డులో డంప్ చేసిన చెత్త

వింజమూరు(ఉదయగిరి): మండల కేంద్రమైన వింజమూరులో 25వేలకుపైగా జనాభా ఉన్నారు. నిత్యం రెండు టన్నుల వరకు చెత్త సమకూరుతుంది. ఈ చెత్త నుంచి సంపద తయారు చేసేందుకు ఆత్మకూరు బైపాస్‌రోడ్డు మార్గంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నిర్మించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొంత నగదు ఖర్చు చేసి మరమ్మతులు చేపట్టి ఆదర్శ కేంద్రంగా సైతం మార్చారు. ఇక్కడ ట్రెయినింగ్‌లు సైతం నిర్వహించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వింజమూరు పంచాయతీ నుంచి సేకరించిన చెత్తను మాత్రం ఇక్కడికి చేర్చి సంపద సృష్టించడం లేదు. పంచాయతీకి దూరంగా ఉన్న గుండెమడకల రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రహరీ పక్కన డంప్ చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో మాత్రం పేడను కొనుగోలు చేసి కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేడం లేదు. దీన్ని గమనించిన ప్రజలు చెత్త నుంచి సంపద సృష్టించడం అంటే ఏమిటో అధికారులకే తెలియాలని గుసగుసలాడుకుంటున్నారు.

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన



దేపూరులో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దివ్య

ఆత్మకూరురూరల్/సోమశిల: జాతీయ ఫ్లోరోసిస్ నివారణ మరియు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా దేపూరులో జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్ సైదా, ఏఎన్ఎం పద్మ, ఆశాకార్యకర్త అమరావతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతసాగరం మండలం బొమ్మవరం పీహెచ్‌సీ పరిధిలోని ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలైన యాకర్లపాడు, గోవిందంపల్లి గ్రామాల్లో జిల్లా ఫ్లోరోసిస్ నిపుణులు డాక్టర్ సీహెచ్ దివ్య అవగాహన కల్పించారు. అనంతరం వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బొమ్మవరం పీహెచ్‌సీ వైద్యులు అశోక్, హెల్త్‌అసిస్టెంట్ నరసారెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



సంగం: ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



దగదర్తి: ప్రతిభాపురస్కారాలు అందుకున్న విద్యార్థులు

సంగం: మండలంలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంగం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాలను శుక్రవారం అందజేశారు. సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన శ్రీసురక్ష ఆస్పత్రి సహకారంతో పంపిణీ చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు బహూకరించారు. అలాగే పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.వేయి చొప్పున నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు అందచేశారు. శ్రీసురక్ష ఆస్పత్రి అధినేత గుత్తా శ్రీనివాసులు, ఎంపీడీఓ షాలెట్, డిప్యూటీ డీఈఓ జానకిరాం, ఎంఈఓ మల్లయ్య, సంగం మండల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకులు టీ మోహన్, అధ్యక్షుడు ఐ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కే వేణు, రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీవీ శేషులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ, సంగం ఉన్నత పాఠశాల హెచ్ఎం పీ బుజ్జయ్య పాల్గొన్నారు.

దగదర్తి :మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. దగదర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్ పాల్గొని మాట్లాడారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 36 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించడం గర్వకారణమని అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చక్రపాణి, జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, దగదర్తి మండలాధ్యక్షుడు మాల్యాద్రి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా మహిళా కార్యదర్శి రాజమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, డివిజన్ కార్యదర్శి కిరణ్ కుమార్, హెచ్ఎంలు ప్రకాశం బాబు, జవహర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయంతో ఇక్కట్లు

ఆత్మకూరు: పట్టణంలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ కండక్టర్లను మార్చే పనులు చేపట్టారు.పట్టణంలోని ఉలవదిబ్బ, సోమశిల రోడ్డు మలుపు, అతిథిలాడ్జి, బీఎస్సార్ ఆస్పత్రి, జేఆర్‌పేట, శివారు ప్రాంతంలోని ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో పాత వాటిని తొలగించి నూతన కండక్టర్లను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడారు.

భక్తిశ్రద్ధలతో సంకష్టహర చతుర్థి పూజలు

మర్రిపాడు: డీసీపల్లిలోని పంచముఖ శక్తి గణపతి ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆత్మకూరు మండలం గండ్లవీడుకు చెందిన కొల్లి అఖిల్‌నాయుడు, దొరస్వామినాయుడు, సుస్మిత, దియ్యాల వెంకటేశ్వర్లునాయుడు, విజయ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పేద రెడ్డి విద్యార్థులకు ఆర్థిక సాయం

కావలి(జలదంకి): పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లోని గొట్టిపాటి చినసుబ్బానాయుడు కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన రెడ్డి ఫౌండేషన్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించి ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇబ్బందులు పడుతున్న పేద రెడ్డి విద్యార్థులకు ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు వాట్సప్ నంబర్లు 83319 98679, 94407 54068 ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

19 నుంచి ఆధార్ క్యాంపులు

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలంలోని 15 సచివాలయాల పరిధిలో గిరిజనుల కోసం ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వసుంధరదేవి శుక్రవారం తెలిపారు.